ఈనాడు మహబూబాబాద్

బుధవారం అక్టోబరు 2, 2024

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఆహ్వానం

మరిపెడ, న్యూస్‌టుడే: మండలంలోని బుర్కితండా గ్రామ పంచాయతీ పరిధిలోని పీర్యతండాలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆహ్వానించినట్లు గిరిజన పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. ఈ నెల 12న నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేశారు.




ఒక్కేసి.. పువ్వేసి..!

జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను మంగళవారం నిర్వహించారు. బుధవారం నుంచి పాఠశాలలకు సెలవుల నేపథ్యంలో ఉపాధ్యాయినులు, విద్యార్థినులు వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. మరిన్ని చిత్రాలు 9లో..

సీరోలు మండలం మన్నెగూడెం జడ్పీ పాఠశాలలో

మహాత్ముడి మాట..



● పల్లెలు మురవాలి.. గాంధీజీ ఆశయం నెరవేరాలి ఉయ్యాలో..

పూలబాట!

ఈనాడు, వరంగల్, కాజీపేట, న్యూస్‌టుడే

గ్రామాల అభివృద్ధి కోసం మహాత్ముడు కలలు కన్నారు.. పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలని తపించారు. గొప్ప వ్యక్తిత్వానికి మారుపేరుగా నిలిచిన ఆయన బోధనలు బతుకమ్మ పండగలోనూ కనిపిస్తాయి.. బతుకమ్మ అంటే జీవిత పండగ అని అర్థం. నిత్యం పంటలతో సుభిక్షంగా ఉంటూ వేడుకలా సాగాలని పార్వతిదేవిని మహిళలు వేడుకుంటారు. గాంధీ కోరుకున్నదీ పల్లెలు పచ్చగా ఉండాలనే. అందుకే బతుకమ్మ పండగలో గాంధీ ఆశయాలు కనిపిస్తాయి. అక్టోబరు 2 గాంధీ జయంతి.. మరోవైపు వైభవంగా జరిగే బతుకమ్మ పండగ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మహాత్ముడి ఆశయ సాధనలో ఆదర్శంగా నిలుస్తున్న ప్రకృతి పల్లెల గురించి కథనం..

పచ్చదనం.. హరితవనం

డోర్నకల్ మండలం బొడ్రాయితండా వాసులు పర్యావరణ పరిరక్షణకు ఇంటింటా మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. తండాలో ఆహ్లాదభరిత నర్సరీతో పాటు పిల్లల పార్కులోనూ పచ్చదనం సంతరించుకుంది. పల్లె ప్రకృతి వనం సైతం పచ్చని అడవిని తలపిస్తోంది. ప్రజల భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమైంది. తండాల్లో రోడ్డుకు ఇరువైపులా 1230కు పైచిలుకు చెట్లు, పల్లె ప్రకృతి వనంలో పెరిగిన 4230 చెట్లు చూపరులను కట్టిపడేస్తున్నాయి. అత్యధిక వర్షపాతం నమోదయ్యే చిరపుంజిలో అంతటి వర్షానికి ప్రధాన కారణం అడవులు, చెట్లేనని బొడ్రాయితండా ప్రజలు గుర్తించి ఆ దిశగా అడుగులు వేసి గాంధీజీ కలల్ని సాకారం చేస్తున్నారు. - డోర్నకల్



బొడ్రాయితండాలో పల్లె ప్రకృతి వనం



ఠాణా మెట్లెక్కని.. మెట్లతిమ్మాపురం

పది దశాబ్దాల చరిత్ర గల ఆదివాసీగూడెం.. సత్యం.. ధర్మం అనే గాంధీజీ సిద్ధాంతాలతో ముందుకు సాగుతోంది. ఊరిలో ఎవరి మధ్యనైనా గొడవ.. ఘర్షణ జరిగితే పరిష్కారం కోసం ఇప్పటి వరకు ఠాణా మెట్లెక్కలేదు. ఎలాంటి సమస్యలు వచ్చినా గ్రామంలోని పెద్దలు చర్చించి సామరస్యంగా పరిష్కరిస్తారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రానికి 15 కి.మీ దూరంలోని అడవి మధ్యన ఉన్న **మెట్లతిమ్మాపురం** ప్రత్యేకత ఇది.. 130 కుటుంబాలు, 750 మంది జనాభా 412 మంది ఓట్లు కలిగిన ఈ గూడెం ప్రజల్లో కల్మషం, విద్వేషాలు ఏమాత్రం కనిపించవు. కలిసిమెలిసి జీవనం కొనసాగిస్తున్నారు. 'సమస్య పరిష్కారానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా.. గ్రామ పెద్దల మధ్యనైనా ఎక్కడైనా జరిగేది న్యాయమే. అందుకే గ్రామ పరువును కాపాడుకునేందుకు స్టేషన్‌కు వెళ్లకుండా ఇరువర్గాల వారు తీర్పును మెచ్చేలా పెద్దల సమక్షంలోనే పరిష్కరించుకుంటున్నాం. ఇది మా పూర్వీకుల నుంచి కొనసాగుతోంది. భవిష్యత్తులోనూ ఇదే విధానాన్ని కొనసాగిస్తాం అని ఊరి దొర బిజ్జ నర్సింహారావు, పటేల్ తాటి కృష్ణ వివరించారు.

● వ్యవసాయంపైనే ఆధారపడిన వీరు ఎక్కువగా వరి, మొక్కజొన్న, మిర్చి పంటలను సాగు చేస్తారు. వందశాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మించుకున్నారు. మురుగునీరు వీధుల్లో పారకుండా ఇంటింటా ఇంకుడు గుంతలను నిర్మించుకుని స్వచ్ఛతలో శెభాష్ అనిపించుకుంటున్నారు.

● గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన వ్యక్తులున్నా ఎక్కడా ఏ పార్టీ జెండాలు, స్తూపాలు, విగ్రహాలు, ఫ్లెక్సీలు కనిపించవు. సుమారు 15 ఏళ్ల నుంచి మద్యపాన నిషేధం అమలు చేస్తున్నారు. అమ్మకాలు చేస్తే రూ.10 వేల జరిమానా విధిస్తున్నారు.

అన్నింట్లో ఆదర్శం

గూడెం ప్రజలు వేలిముద్రలు వేయకూడదనే ఉద్దేశంతో సుమారు 32 ఏళ్ల కిందటనే అప్పటి పెద్ద రామయ్య కనీసం వారందరూ పేర్లు రాసేలా.. బస్సుల పేర్లు తెలిసేలా అక్షరాలు నేర్పించారు. ఆ తర్వాత అక్షరదీపం కార్యక్రమం కింద రాత్రిబడిలో ప్రతి ఒక్కరూ అక్షరాలు నేర్చుకొని 2005లో నాటి భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రశంసలు పొందారు.

● గ్రామస్థుల కోసం అభయ, 100 స్మైల్ ఫౌండేషన్ సహకారంతో గ్రంథాలయం ఏర్పాటు చేసినా కొత్తపుస్తకాలు ఇచ్చే వారు లేరు.

● డిగ్రీ, పీజీ, బీఈడీ, ఇంజినీరింగ్ చదివినవారు 45 మంది వరకు ఉన్నారు. టీచర్లు 13 మంది ఉన్నా ఇందులో పెళ్లి చేసుకొని అత్తారింటికి వెళ్లిన అమ్మాయిలున్నారు. పోలీస్, అటవీ శాఖ ఉద్యోగులు నలుగురున్నారు. ఇందులో ఒకరు మహిళా రిజర్వుడు ఎస్సై ఉన్నారు.

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, బయ్యారం

స్వచ్ఛత పాటిస్తూ.. మద్య రహిత గ్రామంగా



పండెం

కొత్తగూడ, న్యూస్‌టుడే: దట్టమైన అటవీప్రాంతంలోని మారుమూల ఏజెన్సీ పల్లె.. 25 ఏళ్లుగా గ్రామంలో మద్యానికి దూరంగా ఉంటుంది. ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి, ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టారు. అదే మహబూబాబాద్ జిల్లాలోని గంగారం మండలం పండెం గ్రామం. 71 ఇళ్లు, 110 కుటుంబాలుండగా మొత్తం 312 మంది జనాభా ఉన్నారు. మాజీ సర్పంచి బచ్చల వెంకటయ్య ఆధ్వర్యంలో 2000 సంవత్సరంలో మద్యం రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ఓ కమిటీ వేశారు. గ్రామంలో మద్యం అమ్మకూడదని తీర్మానించి ఇప్పటికీ పాటిస్తున్నారు. గ్రామంలో స్వచ్ఛతను పాటించాలనే సంకల్పంతో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి, స్నానాలగదులను నిర్మించుకునేందుకు తీర్మానం చేసుకున్నారు.

66 వసంతాల విగ్రహం



నర్సింహులపేట: నర్సింహులపేటలో గాంధీ విగ్రహం ఏర్పాటు చేసి 66 వసంతాలు పూర్తి కావస్తోంది. ఖమ్మం పట్టణానికి చెందిన కల్లెట్ల వీరయ్య నర్సింహులపేటకు చెందిన మహిళను వివాహం చేసుకున్నారు. తాపీ పని చేసేవారు. నర్సింహులపేటలోని తాపీ కూలీలందరూ కలిసి డబ్బులు జమ చేసి విజయవాడలోని పోరుబందర్‌లో మహాత్మా గాంధీ విగ్రహాన్ని కొనుగోలు చేసి రైలులో మానుకోటకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి తాపీ కాలనీలోని పనిచేసే వారందరూ కట్టెలతో జోలె కట్టి కావడీలో విగ్రహాన్ని పెట్టి భుజాలపై నర్సింహులపేటకు మోసుకొచ్చారు. 1958 అక్టోబరు 2 గాంధీ జయంతి రోజు ఎద్దులబండి గ్రామంలో ఊరేగించి ప్రతిష్ఠించారు. దీనిని గాంధీ బజార్ అని పిలుస్తారు.

పత్తిపాక రహదారిని త్వరగా పూర్తి చేయండి

ఈనాడు కథనానికి స్పందన

మహబూబాబాద్, న్యూస్‌టుడే: రహదారుల విస్తరణలో భాగంగా నాలుగేళ్లుగా సాగుతున్న నెహ్రూసెంటర్ నుంచి పత్తిపాక రహదారి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్‌తో పాటు పురపాలక సంఘం సభ్యులు అధికారులను ఆదేశించారు. 'సమావేశాలేనా.. పరిష్కరించేది ఉందా..' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై సీపీఎం ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య సమావేశంలో ప్రస్తావిస్తూ అసంపూర్తిగా నిలిచిన పత్తిపాక రోడ్ విస్తరణ పనులతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ అంశంపై పనులను ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. చాలా మంది ఇళ్లు కూలుగొట్టుకున్నారని అందరికీ ఒకే విధంగా న్యాయం జరిగే విధంగా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రహదారికి అడ్డంగా ఇళ్లు ఉంటే వాటిని తొలగించాలని సూచించారు.

ఎన్టీఆర్ కూడలిలో ఫౌంటేన్ మరమ్మతు పనులు



డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లోని ఎన్టీఆర్ కూడలిలో ఫౌంటేన్‌కు మంగళవారం మరమ్మతులు చేశారు. 'ఈనాడు'లో 'కళ తప్పిన కూడళ్లు!' శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. ఫౌంటేన్‌ని పునరుద్ధరించి పూర్వ వైభవం తీసుకొచ్చారు. మరమ్మతు పనులను కమిషనర్ నరేష్‌రెడ్డి, ఛైర్మన్ వీరన్న, కౌన్సెలరు శరత్ పర్యవేక్షించారు.

జాబితా రాలేదు.. పరిశీలన జరగలేదు!



జిల్లా కేంద్రంలోని ఫాతిమా స్కూల్ వద్ద అభ్యర్థులు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: డీఎస్సీ 2024 భర్తీకి సంబంధించి 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక జరిగింది. ఆ మేరకు సోమవారం ఫలితాలను ప్రకటించింది. అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్‌లో మంగళవారం నుంచి జరుగుతుందని ప్రకటించారు. రాష్ట్ర విద్యాశాఖ నుంచి 1:3 ఎంపిక జాబితా రానందున ధ్రువపత్రాల పరిశీలన జరగలేదు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యాశాఖ నుంచి అభ్యర్థులకు సందేశంసాయంత్రం వరకు రాలేదు. ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తారేమోనని కొందరు ఫాతిమా హైస్కూల్ చేరుకొని నిరీక్షించారు.



భానుడు.. చెరువులో విద్యుత్తు వెలుగులా..!

ఉదయం వేళ సూర్యుడి ప్రతిబింబం చెరువు నీటిలో విద్యుత్తు బల్బు మాదిరి సాక్షాత్కరించింది. ఆకాశమంతా ఎర్రని కాంతులను వెదజల్లుతూ. . మరోవైపు నీటిలో దీప కాంతిని ప్రసరిస్తూ కనువిందు చేసింది. ఈ దృశ్యాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు. దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల పెద్ద చెరువు వద్ద మంగళవారం 'న్యూస్‌టుడే' తన కెమెరాలో బంధించింది. – న్యూస్‌టుడే, దంతాలపల్లి (డోర్నకల్)



ఈ కష్టం ఎలా తీరునో..?

నర్సింహులపేట, కురవి (మహబూబాబాద్) న్యూస్‌టుడే: జిల్లాలో గత నెలలో కురిసిన భారీ వర్షాలు సాగు భూములను కకావికలం చేశాయి.. సాగు చేసిన వరి పొలంలో రాళ్లు, ఇసుక నిండి రైతుకు గుండె నిండా బాధను మిగిల్చింది. అన్నదాతలకు భారీ నష్టం వాటిల్లగా పరిహారం కోసం నిరీక్షిస్తున్నారు.



☛ వీఎస్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతు ఎలక బాలయ్య కొత్త చెరువు ఆయకట్టు కింద 35 గుంటల భూమిలో రూ.20 వేలు వెచ్చించి వరి వేశారు. గత నెల ఒకటో తేదీన రాత్రి కురిసిన వర్షానికి చెరువు కట్ట తెగి వరద నీరంతా పంట పొలాల మీదుగా వెళ్లింది. పంట కొట్టుకపోయి మటి, ఇసుక, రాళ్లు కనిపిస్తున్నాయి. వాటిని తొలగించేందుకు అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



☛ కురవి మండలం అయ్యగారిపల్లికి చెందిన దూదిమట్ల రవికి ఎకరం పొలంలో వరి వేశారు. మొత్తం సాగు చేయగా వరద ధాటికి కాలువ తెగి పొలం మీదుగా వరద నీరు పోయింది. 30 గుంటల మేరకు పైరు కొట్టుకు పోవడంతోపాటు మొత్తం రాళ్లు, ఇసుక మేటలతో నిండింది.

మహాధర్నా జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేసే వరకు వారి పక్షాన పోరాడుతామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని భారాస కార్యాలయంలో మంగళవారం ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 4న డివిజన్ కేంద్రంలో రైతు రుణమాఫీ సంపూర్ణం చేయాలని చేపట్టిన మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని అమలు చేసేదాకా ప్రభుత్వంపై పోరాడుతామని, రైతుబంధు, రుణమాఫీ కాకపోవడంతో కర్షకులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో భారాస మండలాధ్యక్షుడు ఈదురు ఐలయ్య, నేతలు రామచంద్రయ్య శర్మ, సంజయ్, జ్ఞానేశ్వరాచారి, భాస్కర్, సుభాష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

తొర్రూరు, న్యూస్‌టుడే: లింగనిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.మురళీధర్ తెలిపారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో 'ఆశా డే' సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లింగనిర్ధారణ సమాచారం తెలిస్తే 1098 లేదా 104 లేదా డయల్- 100కు ఫోన్ చేయాలన్నారు. జిల్లాలో స్త్రీ, పురుష నిష్పత్తి రోజురోజుకు తగ్గిపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వాసుపత్రులలో సాధారణ ప్రసవాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మాస్‌మీడియా అధికారి ప్రసాదు, రవీందర్‌రావు, కేవీ రాజు, వైద్యులు జ్వలిత, మానస తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం!

పురపాలక సమావేశంలో ఎమ్మెల్యే మురళీనాయక్



నిరసన తెలుపుతున్న విలీన గ్రామాల కౌన్సిలర్లు, ఫ్లోర్‌లీడర్లు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: 'కొత్త ప్రభుత్వమని కొంత సమయం ఇచ్చాం.. అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్నారు.. ఇప్పటికైనా తమ తీరు మార్చుకొని సక్రమంగా పని చేయకుంటే మెమోలు ఇవ్వడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం ఉండదు.. నేరుగా సస్పెండ్ చేయడమే.' అని మహబూబాబాద్ శాసనసభ్యుడు భూక్యా మురళీనాయక్ హెచ్చరించారు. మంగళవారం పురపాలక సంఘం అధ్యక్షుడు పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పురపాలక అధికారుల తీరుపై ఎమ్మెల్యే మండిపడ్డారు. హైడ్రా తరహా వ్యవస్థ పనులను జిల్లా కేంద్రంలో అమలు చేయమని మీకు ఎవరూ ఆదేశాలు ఇచ్చారు.? చెరువుల ప్రాంతాల్లోని ఇళ్లకు నోటీసులు ఎందుకు ఇస్తున్నారని పురపాలక అధికారులను ప్రశ్నించారు. తాము చెప్పలేదని నీటి పారుదల శాఖ ఏఈ శ్రావణి వివరించారు. రెవెన్యూ అధికారులను పిలిపించి తెలుసుకోవగా తాము కూడా ఆదేశాలు ఇవ్వలేదని వారు స్పష్టం చేశారు. దీంతో ఎమ్మెల్యే పట్టణ ప్రణాళికా విభాగం అధికారులపై మండిపడ్డారు. ఇళ్లకు విద్యుత్తు మీటర్లు, శివారు కాలనీల్లో స్తంభాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. త్వరలో స్మార్ట్ కార్డులు జారీ చేస్తామని నిరుపేద కుటుంబ సభ్యుల అన్ని వివరాలు అందులో ఉంటాయన్నారు. నియోజకవర్గంలో సంద్రలగూడెం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశామన్నారు. అభివృద్ధి పనుల్లో తమను పట్టించుకోవడం లేదని అన్ని పార్టీల కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. విలీన గ్రామాల సమస్యలు పరిష్కరించాలని ఇంటి నెంబర్లు కేటాయించాలని సంబంధిత కౌన్సిలర్లు ప్లకార్డులు ప్రదర్శించారు గుండెపోటుతో మృతి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు చుక్కల ఉదయచందర్‌కు సంతాపం ప్రకటించి మౌనం పాటించారు.

ప్రజాప్రతినిధులు ఏమన్నారంటే..

☛ పురపాలక సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రగతి, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు కూడా రావడం లేదన్నారు. విద్యుత్తు లైట్లు స్థానికంగా కొనుగోలు చేసేలా ప్రభుత్వం నుంచి ఆదేశాలను ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు.

☛ సీపీఐ ఫ్లోర్‌లీడర్ అజయసారథి మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను విడుదల చేయించాలన్నారు. విద్యుత్తు మీటర్లకు కొర్రీలు పెట్టొద్దని, అందరికీ ఇంటి నెంబర్లు ఇవ్వాలని కోరారు.

☛ సీపీఎం ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య మాట్లాడుతూ అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి అగ్రిమెంట్ చేయలేదన్నారు. వాటిని చేపడుతారా? లేదా? అని ప్రశ్నించారు.

☛ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వార్డుల్లో ఎలాంటి పనులు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

☛ భారాస ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్ మాట్లాడుతూ స్నేహనగర్‌లో వరద కాలువ నిర్మించకపోవడంతో కాలనీల్లో ఇళ్లు మునిగిపోయాయన్నారు. నిజాం చెరువు శిఖం ప్రాంతంలో ఇళ్లకు నోటీసులు ఇచ్చారని వారికి ప్రత్యామ్నాయం చూపాలన్నారు.

వీధులకు ప్రముఖుల పేర్లు

ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన ఎమ్మెల్యే దివంగత జెన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి, సుదీర్ఘకాలం సర్పంచిగా పని చేసిన దివంగత సర్పంచి ఘన్‌శ్యాందాస్ పేర్లను ఆయా ప్రాంతాల వీధులకు పెట్టాలని కౌన్సిలర్ ఎడ్ల వేణు ప్రతిపాదించగా ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించారు. చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

❒ సమావేశంలో కమిషనర్ నోముల రవీందర్, పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు మార్నేని వెంకన్న, డీఈ ఉపేందర్, మేనేజర్ శ్రీధర్, ట్రాన్స్‌కో డీఈ విజయ్ పాల్గొన్నారు.

పండగ వేళ.. ప్రయాణం భారం!

రైళ్లు రద్దు.. బస్సుల్లో రద్దీ

బతుకమ్మ పండగ వచ్చిందంటే ఆడపడుచులు వారి తల్లిగారింటికి బయలుదేరుతారు. పాఠశాలలకు మంగళవారం నుంచి సెలవులు ప్రకటించడంతో పిల్లలతో ఎంత కష్టమైనా సొంతింటికి వెళతారు. ఓరుగల్లు ప్రజలు ఎక్కువగా రైళ్లలో ప్రయాణిస్తారు. ఈసారి పండగకు విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. మూడోలైను పనుల కారణంగా వరంగల్, కాజీపేట నుంచి వెళ్లే రైళ్లను ఈ నెల 7 వరకు రద్దు చేశారు. ప్రత్యేక రైళ్లను ప్రకటించినా వాటిలో చాలా వరకు రద్దయ్యాయి. దీంతో అందరూ బస్సులనే ఆశ్రయించాల్సి వస్తోంది. బతుకమ్మ, దసరా పండగలకు వరంగల్ ఆర్టీసీ అదనపు బస్సులను మంగళవారం నుంచి నడిపిస్తోంది. రైలు ప్రయాణికులంతా వాటినే ఆశ్రయిస్తారు కాబట్టి రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో కొందరు సొంత వాహనాల్లో పయనం కావడానికి సిద్ధమవుతున్నారు. చౌకగా ప్రయాణం చేసే రైళ్లు రద్దు కావడం అందరికీ భారంగా మారింది..

-కాజీపేట, హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే



రైళ్లు రద్దు కావడంతో వెల వెల పోతున్న కాజీపేట రైల్వే స్టేషన్

బస్సు	ఛార్జీల వివరాలు (రూ.)	రైలు
300	వరంగల్-హైదరాబాదుకు	80
275	వరంగల్-ఖమ్మం	75
250	వరంగల్-రామగుండం	70



ప్రయాణికులతో కిక్కిరిసి ఉన్న హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్



అదనపు భారం రూ.2 వేలు

రైళ్లు లేకపోవడంతో ఈసారి బస్సు ప్రయాణం తప్పదు. వాటిలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉన్నా, పురుషులు తట్టుకోవడం కష్టం. దీంతో ఛార్జీలు అధికంగా ఉండే డీలక్స్, సూపర్ లగ్జరీ వంటి ఉన్నత స్థాయి బస్సులను ఆశ్రయించాల్సిందే. వాటిలోనూ సీట్లు దొరకడం కష్టం.

ఇదీ పరిస్థితి: ఇంట్లో నలుగురు వ్యక్తులు హైదరాబాద్ నుంచి వరంగల్‌కి ప్రయాణం చేయాలనుకుంటే రైల్లో ఛార్జీతో పోలిస్తే ఒక్కొక్కరికి బస్సులో రూ.200 నుంచి రూ.225 వరకు ఎక్కువ అవుతుంది. దీనికి తోడు ఆటోలు, ఇతర రవాణా ఛార్జీలు కలుపుకొని కుటుంబానికి రానుపోను రూ.2000 వరకు అదనపు భారం పడుతుంది.

ముందస్తు ప్రయాణం మేలు

పండగకు ముందురోజు కంటే ఒకటి, రెండు రోజుల ముందే ప్రయాణం చేస్తే కొంత రద్దీని తట్టుకోవచ్చు. చాలా మంది సాయంత్రం విధులు ముగించుకొని బయలుదేరుతారు. కాస్త ముందుగా బయలుదేరితే ఆర్టీసీకి కాస్త వెసులుబాటు లభిస్తుంది.

● ఇప్పుడు చాలా మందికి కార్లు ఉంటున్నాయి. కాబట్టి కాస్త ఖర్చు ఎక్కువైనా కారు లేదా ఇతర వాహనాలు వాడితే సామాన్య ప్రజలకు బస్సుల్లో కాస్త వెసులుబాటు ఉంటుంది.

ట్రిప్పుల సంఖ్య పెంచాలి..



-మాడిశెట్టి చంద్రశేఖర్, హనుమకొండ

గతంలో రైల్లో ప్రయాణం చేశాం. ఈసారి అవి రద్దయ్యాయి. దీనితో బస్సుల్లో రద్దీ పెరిగే అవకాశం ఉంది. రైళ్లు నడిచే మార్గంలో ఆర్టీసీ బస్సులు ఎక్కువగా నడపించాలి. ట్రిప్పుల సంఖ్య పెంచాలి. రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయాలి.

అదనపు భారం



-గద్దల సతీష్, ప్రయాణికుడు

మా స్వగ్రామం మంచిర్యాల దేవనూరు. మా బంధువులు అంతా అక్కడే ఉంటారు. మేము హనుమకొండకు వచ్చి దాదాపు 15 ఏళ్లు అవుతోంది. అప్పుడప్పుడు మా గ్రామానికి వెళ్లి వస్తుంటాం. ఈ ఏడాది దసరాకు వెళ్లాలని అన్నీ సిద్ధం చేసుకున్నాం. ఇంతలోనే రైళ్లు రద్దు అని చెబుతున్నారు. బస్సుల్లో వెళ్లే ప్రయాణ భారంతో పాటు సమయం ఎక్కువగా తీసుకుంటుంది. ఈ సమయంలో రైళ్లు రద్దు చేయడం సరికాదు.. పండగలు ముగిసిన తర్వాత ఆ నిర్ణయం తీసుకుంటే బాగుండేది



బల్లార్ష మార్గంలో బహుకష్టం

బల్లార్ష మార్గంలో పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల ప్రాంతాలకు వెళ్లడానికి రైలు మార్గమే సులువు. చౌకగా వెళ్లొచ్చు. రైళ్లు రద్దు చేయడంతో కరీంనగర్ మీదుగా బస్సుల్లో వ్యయ ప్రయాసలతో ప్రయాణించాల్సిందే.

నిండిన బెర్తులు: దసరా పండగకు కోలకతా, ఒడిశా, బెంగళూరు, మైసూరు, తిరుపతి ప్రాంతాలకు ఎక్కువగా వెళుతుంటారు. ఈమార్గంలో రైళ్లకు చాంతాండంత వెయిటింగ్ లిస్టు ఉంది. హౌరా, యశ్వంతపూర్, పద్మావతి రైళ్లల్లో బెర్తులు లేవని చూపిస్తున్నాయి.

గతేడాది అక్టోబరులో దసరా, బతుకమ్మ పండగ నేపథ్యంలో వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల నుంచి ప్రయాణించినవారి సంఖ్య (రోజుకు సగటున)

మార్గం	ప్రయాణికుల సంఖ్య	సాధారణ రోజుల్లో ప్రయాణికుల సంఖ్య	తేడా
వరంగల్-కాజీపేట- సికింద్రాబాద్	16,000	9,500	6,500
కాజీపేట-వరంగల్- ఖమ్మం	13,000	8,500	4,500
కాజీపేట - వరంగల్- బల్లార్ష	15,000	6,500	7,500

ప్రైవేటు వాహనాలకు గిరాకీ



ప్రైవేటు వాహనాలకు గిరాకీ బాగా పెరిగింది. ఇప్పటికే వరంగల్‌లోని ట్రావెల్స్‌లో ఉన్న నాలుగు చక్రాల వాహనాలు బతుకమ్మకు ముందు రోజున బుక్ అయ్యాయి. డిమాండ్ పెరగడంతో ఆ రోజు ప్రయాణానికి అదనంగా వసూలు చేయనున్నారు.

నేటి నుంచి 850 అదనపు బస్సులు..

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: వరంగల్ రీజియన్ నుంచి 850 అదనపు బస్సుల (ట్రిప్పులు) నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఎక్కువగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు తిరుగుతాయి. దూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సులను ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఈ నెల 2 నుంచి 8 వరకు ఇవి నడుస్తాయి. పండగ అనంతరం తిరుగు ప్రయాణంలో భాగంగా 13, 14, 15 తేదీల్లో రద్దీకి అనుగుణంగా ఆయా డిపోల నుంచి హైదరాబాద్‌కు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. రద్దీ దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు సైతం బస్సులు నడపనున్నారు. సాధారణ ఛార్జీలే వసూలు చేస్తామని అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకం అమలులో ఉండటంతో గతేడాది కంటే అదనంగా బస్సులను నడిపిస్తున్నామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు.

● హనుమకొండ బస్టాండ్ నుంచి హైదరాబాద్ రూట్లో నిత్యం 250 బస్సులు నడుస్తుంటాయి..దాదాపు 400 ట్రిప్పులు. పండగ సందర్భంగా అదనంగా 150 బస్సులు నడిపిస్తారు. ● ఖమ్మం, మహబూబాబాద్ రూట్లలో వరంగల్ రీజియన్ నుంచి హనుమకొండ, మహబూబాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు నడుస్తాయి. 25 బస్సులు ఖమ్మం వరకు ఉంటాయి. మహబూబాబాద్ నుంచి ఖమ్మం వరకు మరికొన్ని బస్సులు నిత్యం నడుస్తాయి. ఈ మార్గంలో అదనంగా మరో 50 బస్సులను పెంచనున్నారు.

డిపోల వారీగా నడిపే ప్రత్యేక బస్సులు

వరంగల్-I	125
వరంగల్-2	125
హనుమకొండ	125
పరకాల	93
నర్సంపేట	119
జనగామ	120
తొర్రూరు	48
మహబూబాబాద్	47
భూపాలపల్లి	48

రేపటి నుంచి శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రులు

● 10న సద్దుల బతుకమ్మ.. 12న దసరా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు

రంగంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రులు ఈ నెల 3వ తేదీ నుంచి 13 వరకు వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు కార్యనిర్వహణ అధికారిణి శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు వెల్లడించారు. 10న మహానవి(దుర్గాష్టమి) శ్రీభద్రకాళి జన్మోత్సవం, సద్దుల బతుకమ్మ, 12న విజయదశమి(దసరా) ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఉత్సవాల వివరాలు వెల్లడించారు. శ్రీదేవి శరన్నవరాత్రులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని, తొమ్మిది రోజులపాటు తొమ్మిది రూపాల్లో అమ్మవారిని సుందరంగా అలంకరిస్తారని, ఉదయం, సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తులకు వాహన సేవలుంటాయన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్, చింత శ్యాంసుందర్, అర్చకుడు గండికోట రాము తదితరులు పాల్గొన్నారు.

రోజు వారీగా కార్యక్రమాలు..

- 2న ఉదయం హరిద్రాదర్శనం శరన్నవరాత్రయాగ పూర్వాంగనిధి, సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ
- 3న భేరి పూజ, ధ్వజారోహణం, కలశ స్థాపన, అమ్మవారిని శైలపుత్రిక్రమము బాలా త్రిపురసుందరి అలంకరణ, ఉదయం 11 గంటలకు వృషభ వాహనసేవ, సాయంత్రం మృగ(జింక) వాహనసేవ
- 4న అన్నపూర్ణాలంకారం, బ్రహ్మచారిణి దుర్గార్చన, మకర, చంద్రప్రభ వాహనసేవలు
- 5న గాయత్రి అలంకరణ, చంద్రఘంటా దుర్గార్చన, సింహ, గజ వాహనసేవలు
- 6న శ్రీమహాలక్ష్మి అలంకరణ, కూష్మాండీ దుర్గార్చన, సూర్యప్రభ, హంస వాహనసేవలు
- 7న లలితా పంచమి శ్రీరాజరాజేశ్వరి లలితా మహాత్రిపుర సుందరి, స్కందామాత దుర్గార్చన, పల్లకీ సేవ, శేషవాహనసేవ
- 8న భవాని అలంకరణ, కాత్యాయని దుర్గార్చన, గంధోత్సవం, చాముండ దుర్గార్చన, సాలభంజిక సేవ
- 9న శ్రీ సరస్వతీమాత, కాళరాత్రి దుర్గార్చన, రాత్రి అమ్మవారికి రథోత్సవం
- 10న మహాష్టమి(దుర్గాష్టమి) శ్రీభద్రకాళి అమ్మవారి జన్మోత్సవం, మహా దుర్గా అలంకారం, మహా గౌరి దుర్గార్చన, భద్రపీఠ సేవ, అశ్వవాహన సేవ, సద్దుల బతుకమ్మ
- 11న మహా నవమి మహిషమర్ధిని అలంకరణ, శుంభు దుర్గార్చన, వసంతోత్సవం, మహా పూర్ణాహుతి, సాయంత్రం సర్వభూపాల వాహనసేవ
- 12న విజయ దశమి, శమీ పూజ, శ్రీభద్రకాళి అమ్మవారికి మహా పట్టాభిషేకం, నిజరూప దర్శనం, రాత్రి భద్రకాళి చెరువు(తటాకంలో)లో శ్రీభద్రకాళి భద్రేశ్వరులకు తెప్పోత్సవం
- 13న సాయంత్రం శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణం.

రూపుదిద్దుకుంటున్న కాజీపేట వంతెన

ఈనాడు, వరంగల్, కాజీపేట, న్యూస్‌టుడే

● రాయ్‌పూర్‌లో సిద్ధమవుతున్న 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'

- శంకుస్థాపన - 2017
- టెండర్లు పిలిచింది - 2019
- పూర్తి కావాల్సింది - 2020
- పనులు ప్రారంభమైంది - 2021
- మొత్తం అంచనా వ్యయం - రూ.45 కోట్లు
- 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' భాగం నిర్మాణానికి - రూ.20 కోట్లు
- వెడల్పు - 9.5 మీటర్లు
- ఎడమవైపు పాదచారుల దారి - 1.5 మీటర్లు.



తయారీ దశలో 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'

కాజీపేట వద్ద నిర్మాణంలో ఉన్న రెండో ఆర్వోబీపై బిగించేందుకు ఉక్కుతో తయారు చేస్తున్న 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో సిద్ధమవుతోంది. నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈనెలాఖరుకు విడిభాగాలు ఇక్కడకు తీసుకొస్తారు. విల్లు ఆకారంలో ఉక్కుతో ఉన్న ఈ భాగాన్ని రైల్వే పట్టాలపై నిపుణులు బిగించనున్నారు. రాష్ట్రంలో ఇలాంటి తరహా వంతెన ఇప్పటి వరకు ఎక్కడా లేదని.. కాజీపేటపై రెండో ఆర్వోబీపై వచ్చేది మొదటిది అని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

మరో రూ.16 కోట్లు విడుదల చేయాలి

ఈ వంతెనను వేంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్ అనే గుత్తేదారు సంస్థ నిర్మిస్తోంది. ఈ సంస్థకు ప్రభుత్వం ఇంకా రూ.16 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులతో సమీక్షించి ఈ నిధులను వెంటనే విడుదల చేయాలని చెప్పారు. మూడు నెలలు గడుస్తున్నా నిధులు ఇంకా గుత్తేదారుకు అందలేదని, అందుకే వంతెన నిర్మాణం నిలిచిపోయినట్టు సమాచారం. ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టి నిధులను వెంటనే విడుదల చేస్తే పనులు వేగంగా పూర్తవుతాయి.

విల్లు ఆకారమే ప్రత్యేకం

కాజీపేటలో ఉన్న పాత ఆర్వోబీకి కొత్త వంతెన పూర్తి భిన్నంగా ఉంటుంది. దీన్ని 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' గా పిలుస్తారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. రైళ్ల రాకపోకలకు ఏమాత్రం అంతరాయం లేకుండా వంతెన నిర్మాణాన్ని కొనసాగించేందుకు ముందే సిద్ధం చేసిన 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'ను వంతెనపై బిగించనున్నారు. వంతెనను 21 స్తంభాలతో నిర్మిస్తుండగా, ఇందులో రైల్వే లైన్ల పైభాగంలో మాత్రం విల్లు ఆకారంలో ఉండే నిర్మాణం మొత్తం ఉక్కు మిశ్రమంతో ఉంటుంది. దీనికి ఆధారంగా మూడు పిల్లర్లు ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. రైల్వే పట్టాలపై 800 టన్నుల బరువుతో 250 అడుగుల పొడవుతో రెండు భాగాలు ఉంటాయి. అంటే మొత్తం 1600 టన్నుల బరువు, 500 అడుగుల పొడవుతో 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' భాగాలను రాయ్‌పూర్‌లో సిద్ధం చేస్తున్నారు. ఇటీవలే మన ఇంజినీర్లు అక్కడికి వెళ్లి దాన్ని పరిశీలించారు. 'ఈనాడు' ఆ చిత్రాలను ప్రత్యేకంగా సంపాదించింది. ప్రస్తుతం ఉన్న వంతెన కన్నా కొత్త వంతెన ఎక్కువ ఎత్తుతో ఉండనుంది.



నేడు ఏకలవ్య గురుకుల భవనం ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్రమోదీ



కొత్తగూడ, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి గ్రామ శివారులో రూ.40 కోట్ల నిధులతో నిర్మించిన ఏకవలవ్య మోడల్ రెసిడెన్షియల్ గురుకులం (ఈఎంఆర్ఎస్) నూతన భవనాన్ని బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నట్లు గురుకుల ప్రధానాచార్యుడు అజయ్‌సింగ్ తెలిపారు. 2020లో కొత్తగూడ మండలానికి ఈఎంఆర్ఎస్ గురుకులాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. తాత్కాలికంగా కొత్తగూడలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల భవనంలో ఈ గురుకులాన్ని కొనసాగిస్తున్నారు. పొగుళ్లపల్లి శివారులో 2021 జూన్ 16న భవన పనులు ప్రారంభించగా ఇటీవల పూర్తి చేశారు. బుధవారం నూతన గురుకుల భవనాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఝార్ఖండ్ నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. పొగుళ్లపల్లి నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, జిల్లా ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

భారీ బతుకమ్మకు అంతర్జాతీయ రికార్డు



జనగామలోని నెహ్రూపార్కు సెయింట్‌మేరీస్ ఉన్నత పాఠశాలలో 36.2 అడుగుల భారీ బతుకమ్మ

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద ఉన్న సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. సంబరాల్లో భాగంగా 36.2 అడుగుల బతుకమ్మను తయారు చేసి ప్రపంచంలోకెల్లా అతిపెద్ద బతుకమ్మగా ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాధించుకుంది. స్టీల్, వైబ్రెంట్ ఆర్టిఫిషియల్ ఫ్లవర్స్‌తో 700 మంది విద్యార్థులు, 30 మంది ఉపాధ్యాయులు కలిసి 24 గంటలలోపు దీన్ని తయారు చేశారు. ఇంతకు ముందు ఉన్న 31 అడుగుల బతుకమ్మ రికార్డును అధిగమించినందున ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు నరేందర్‌గౌడ్, సుభాషిని.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసాని శ్రీధర్‌కు సదరు రికార్డు ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు.



ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ధ్రువీకరణపత్రం

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	110
రిటైల్:	132
డ్రెస్డ్:	191
స్కిన్‌లెస్:	218

పెద్ద సార్ల దయతోనే.. బతికి బడికి వచ్చా



విద్యార్థితో ఉపాధ్యాయులు

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్ శివారు పంపుబావితండాకి చెందిన ఈ బుడతడి పేరు రమావత్ అశోక్. ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థి. ఇతను అస్వస్థతకు గురి కాగా 11న ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యుల సిఫారసు మేరకు ఎంజీఎం ఆసుపత్రిలో చేర్పించారు. డెంగీ, బీపీ, మధుమేహానికి తోడు కాలేయం, థైరాయిడ్, మూత్రపిండాల సంబంధ జబ్బులతో బాధ పడుతున్నట్లు తెలిసింది. ఇతనికి తండ్రి లేడు. తల్లి మానసిక స్థితి బాగుండదు. అమ్మమ్మ అజ్మీర రమ చేరదీశారు. ఆసుపత్రిలో ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్నట్లు ఈమె శేషదీపిక అనే ఉపాధ్యాయురాలికి ఫోన్ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు రోజిలిన్, తోటి ఉపాధ్యాయుల వద్ద కొంత సమకూర్చి అందించారు. డోర్నకల్ జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండి నర్సింహారావుకి విషయం తెలియడంతో ఆయన బాలుడి రిపోర్టులు తెప్పించుకుని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కి లేఖ రాసి వాట్సప్ చేశారు. వారు స్పందించడంతో అప్పటిదాక జనరల్ వార్డులో ఉంచిన బాలుడిని ఐసీయూలోకి తీసకెళ్లి చికిత్స అందించారు. అశోక్ కోలుకొని మంగళవారం బడికి వచ్చాడు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ చొరవతో ఇది సాధ్యమైందని ప్రధానోపాధ్యాయుడు నర్సింహారావు వివరించారు. పెద్ద సార్ల దయతోనే తన జ్వరం తగ్గిందని. ..బతికి బడికి వచ్చానని బాలుడు పేర్కొన్నప్పుడు అందరి కళ్లు చెమర్చాయి.

ప్రభుత్వ పాఠశాలకు ఫర్నీచర్ అందజేత



మరిపెడ, న్యూస్‌టుడే: వీరారం ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన విశ్రాంత వైద్యుడు కట్కూరి నరేందర్‌రెడ్డి రూ. లక్ష వ్యయంతో విద్యుత్తు సౌకర్యం, టేబుల్స్, కుర్చీలు, బల్లాలు అందజేశారు. గతంలో నరేందర్‌రెడ్డి పాఠశాలకు ఎకరం తొమ్మిది గుంటల భూమి అందజేశారని ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీనిర్మల తెలిపారు. తాను చదువుకున్న పాఠశాలకు, గ్రామానికి సహకారం అందించాలని ఆకాంక్షతో విరాళం అందజేసినట్లు ఆమె చెప్పారు.

సమగ్ర వివరాలు సేకరించాలి

మహబూబాబాద్ న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డుల కోసం సమగ్రంగా వివరాలను సేకరించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. కుటుంబ డిజిటల్ కార్డులు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, రెండు పడకల గదులు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై మంగళవారం ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, డేవిడ్ పాల్గొన్నారు.


పెద్దవంగర ఉన్నత పాఠశాలలో..


కేసముద్రం మండలం కల్వల పాఠశాలలో


మహబూబాబాద్‌లోని ఏకశిల పబ్లిక్ పాఠశాలలో బతుకమ్మ వేషధారణలో విద్యార్థి


పెద్దనాగారం ఉన్నత పాఠశాలలో


కంబాలపల్లి జడ్పీ పాఠశాలలో..


తొర్రూరు: నాంచారిమడూరు పాఠశాలలో..


దోర్నకల్‌లోని సెయింట్ ఆగ్నెస్ పాఠశాలలో..


మరిపెడ: తాళ్లఊకల్ పాఠశాలలో..

పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబురాలు

న్యూస్‌టుడే, బృందం: తెలంగాణ సంస్కృతిని చాటే బతుకమ్మ పండగ వేడుకలను మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో ముందస్తుగా నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నేటి నుంచి దసరా సెలవుల నేపథ్యంలో పాఠశాలల్లో ఉదయం నుంచే వేడుకలు ప్రారంభంకాగా ఆవరణల్లో బతుకమ్మ పాటలు హోరెత్తాయి.


గార్ల నిర్మలా హైస్కూల్లో..


నెల్లికుదురు ఆదర్శ పాఠశాలలో బతుకమ్మలతో


కంకరబోడు జడ్పీ పాఠశాలలో..


బయ్యారం బాలికోన్నత పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు


మహబూబాబాద్‌లోని కృష్ణవేణి పాఠశాలలో


దంతాలపల్లి మండలం పెద్దముప్పారంలో


కురవి మండలం బలపాల పాఠశాలలో...


బత్తులపల్లిలో బతుకమ్మను ఉపాధ్యాయులతో కలిసి ఆడుతున్న విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762,
మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499
దోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

మహబూబాబాద్ టౌన్: పట్టణంలోని పాతబజార్ ఏకశిల హోలిఏంజెల్స్ పాఠశాల వెనుక వీధిలో చెత్త సేకరణ వాహనం పది రోజులుగా రావడం లేదు. వ్యర్థాలన్నీ పేరుకుపోయాయి. **- తిరుకుళ్ల లక్ష్మి**

సమాధానం: సిబ్బందిని పంపించి తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- తోట రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

దోర్నకల్, న్యూస్‌టుడే: జోగ్యాతండాకు వెళ్లే మార్గంలో వీధి దీపం వెలగడం లేదు. **- పార్వతి**

సమాధానం: బాగు చేయిస్తాం. **- నాగయ్య, పంచాయతీ కార్యదర్శి, జోగ్యాతండా**

పైపులైను లీకేజీకి మరమ్మతు



మహబూబాబాద్ టౌన్: భగత్‌సింగ్‌నగర్ కాలనీలో పైపులైను లీకేజీ ఏర్పడిందని సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు 26వ వార్డు కౌన్సిలర్ డొలాగర్ స్వాతి స్పందించారు. సిబ్బందితో మరమ్మతు చేయించి నీటి వృథాను అరికట్టేలా చర్యలు తీసుకున్నారు.

వీధి దీపాలకు..

మహబూబాబాద్ టౌన్: రామమందిరం ఆలయం వీధిలో వీధి దీపాలు పూర్తిస్థాయిలో వెలగడం లేదని సెప్టెంబర్ 24వ తేదీ మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ ఏఈ బోడ సురేష్ స్పందించారు. సిబ్బందిని పంపించి మరమ్మతు చేయించారు.

ఎరువుల విక్రయాలపై రసీదు తప్పనిసరి

తొర్రూరు, న్యూస్‌టుడే: ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు విధిగా రసీదులు అందించాలని, ఆధార్‌కార్డు తీసికొచ్చిన రైతులకే ఎరువులు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి శ్రీదేవి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని పలు దుకాణాల్లో మంగళవారం తనిఖీలు చేపట్టి రికార్డులు, స్టాక్ వివరాలను పరిశీలించారు. అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట సిబ్బంది, తదితరులున్నారు.

'దేశంలో మతోన్మాద దాడులు సరికాదు'

తొర్రూరు, న్యూస్‌టుడే: కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన భాజపా దేశంలో మతోన్మాదాన్ని పెంచిపోషిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం మండలంలోని కంఠాయపాలెంలో నిర్వహించిన పార్టీ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మైనార్టీలపై ఉద్దేశపూర్వకంగా దాడులు చేయిస్తోందన్నారు. రానున్న రోజుల్లో భాజపా వ్యతిరేక ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు అఫ్జల్‌బీ, రామ్మూర్తి, సోమిరెడ్డి, అశోక్, యాకూబ్, సైదులు, సాంబయ్య, జితేందర్‌రెడ్డి, స్వామి, సారయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ఇరువర్గాల ఘర్షణ.. 11 మంది బైండోవర్

దంతాలపల్లి, న్యూస్‌టుడే: భూ విషయంలో ఇరువర్గాలు దాడి చేసుకున్న సంఘటన మండలంలోని నిదానపురంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామ శివారులోని స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. రెండేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే రెడ్యానాయక్ నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనులు ప్రారంభించలేదు. ఈ స్థలంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకల నిర్వహణలో భాగంగా విద్యుత్తు దీపాల కోసం కర్రలు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామానికి చెందిన పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం చలో నిదానపురం కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు కర్రలను తొలగించి జెండాలు పాతారు. దీంతో గ్రామస్థులు జెండాలను తొలగిస్తుండగా ఇరువర్గాలు దాడి చేసుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని ఠాణాకు తరలించారు. ఇరువర్గాలు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. తొర్రూరు సీఐ జగదీశ్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని గొడవకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. 11 మందిని బైండోవర్ చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

డీఎస్సీ బయాలజీ విభాగంలో 5వ ర్యాంకు


శ్రీదర్

మరిపెడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన డీఎస్సీ ఫలితాల్లో మరిపెడ పట్టణానికి చెందిన జోనగిరి శ్రీదర్ బయాలజీ విభాగంలో 5వర్యాంకు సాధించి సత్తాచాటారు. ప్రస్తుతం ఇల్లందు సింగరేణి పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయుడుగా శ్రీధర్ పనిచేస్తున్నారు. శ్రీధర్‌కు కుటుంబ సభ్యులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

వరద బాధితులకు చేయూత

మరిపెడ, న్యూస్‌టుడే: ఇటీవల భారీ వర్షాలతో ఆకేరు వరదలకు నీట మునిగిన మండలంలోని సీతారాం తండా వాసులకు మరిపెడ సెయింట్ ఆగస్టీన్ ఉన్నత పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, చిన్నారులు చేయూత అందించారు. మంగళవారం తండాలో గిరిజనులకు నిత్యావసరాల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దీన, కరస్పాండెంట్ షీనాటోమ్, వైస్ ప్రిన్సిపల్ ఫ్రాన్సీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల గోదాం తనిఖీ

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్‌లోని పీఏసీఎస్ సొసైటీ ఎరువుల గోదాంను జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎ.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ఎన్.తిరుపతిరెడ్డి తనిఖీ చేశారు. ఎరువుల దుకాణ అనుమతి పత్రం, ఓ ఫారం, ఈ పాస్ యంత్రంలో ఉన్న ఎరువుల నిల్వ, రికార్డులను పరిశీలించారు.

దసరా సెలవులొచ్చేశాయ్..

నేటి నుంచి ఈనెల 14వ తేదీ వరకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. దీంతో వసతి గృహాల్లోని విద్యార్థులు ఉత్సాహంగా ఇంటిబాట పట్టారు. పుస్తకాలు, దుస్తులు, ఇతర సామగ్రిని బ్యాగుల్లో సర్దుకుని సహచర విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ తల్లిదండ్రులతో కలిసి ఉత్సాహంగా వెళ్లారు.

– నెహ్రూసెంటర్, తొర్రూరు, న్యూస్‌టుడే


జిల్లా కేంద్రంలోని వసతి గృహం నుంచి విద్యార్థులను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు



తొర్రూరులో..

మురుగు తొలగించారు..



పెద్దవంగర, న్యూస్‌టుడే: మండలంలోని రాజమాన్‌సింగ్ తండా శివారు దేవునిబావితండా రెండు పడకల గదుల వెంబడి మురుగు నీరు పేరుకుపోయి దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయన్న స్థానికుల సమస్యను 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి మహేష్‌కు వివరించింది. ఆయన వెంటనే స్పందించి సిబ్బందితో మురుగు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించి, సమస్య పరిష్కరించారు.

గుండెపోటుతో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మృతి


చుక్కల ఉదయ చందర్

మహబూబాబాద్, న్యూస్‌టుడే: టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సీనియర్ న్యాయవాది చుక్కల ఉదయచందర్(64) సోమవారం రాత్రి తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి వివిధ పార్టీల నాయకులు సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యుడిగా, పాత్రికేయుడిగా, బీసీ సామాజిక ఉద్యమ నేతగా ఉదయ్‌చందర్ ఈ ప్రాంతప్రజలకు సుపరిచితుడు. తెదేపా మహబూబాబాద్ పట్టణ, జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రస్తుతం టీపీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉదయ్‌చందర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలో పాల్గొన్న నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్ పాడె మోశారు. ఎమ్మెల్యే మురళీనాయక్-ఉమ దంపతులు నివాళులర్పించారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చంద్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారధి, తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.రామచందర్‌రావు, వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యే శ్రీరాంభద్రయ్య ఉదయచందర్ మృతికి సంతాపం ప్రకటించారు. ఉదయచందర్ మృతి పార్టీకి తీరనిలోటని ఎంపీ పోరిక బలరాంనాయక్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.


పాడె మోస్తున్న ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామానికి చెందిన కెంచ మొగిలి భార్య కెంచ రాజమణి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆ కుటుంబ సభ్యులను మంగళవారం ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి పరామర్శించారు.

'నూకల' ఆరోగ్య స్థితిపై నేతల ఆరా

మరిపెడ, న్యూస్‌టుడే: మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నూకల నరేష్‌రెడ్డి గుండె సంబంధిత అనారోగ్యానికి గురై హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం భారాస మాజీ మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ కుమారి బిందు, మాజీ ఓడీసీఎమ్మెస్ ఛైర్మన్ మహేందర్‌రెడ్డిలు ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆయన కుమారుడు అభినవ్‌రెడ్డిని అడి గి తెలుసుకున్నారు.


అభినవ్‌రెడ్డితో మాట్లాడుతున్న హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, రెడ్యానాయక్, బిందు, మహేందర్‌రెడ్డి

జీవనశైలిని మార్చుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా వయోవృద్ధులు తమ జీవనశైలిని మార్చుకొని వృద్ధాప్యంలో ఆనందంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో కోరారు. మంగళవారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం 14567 హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులను సన్మానించారు. వారిని గౌరవిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. జడ్పీ సీఈవో నర్మద, జిల్లా సంక్షేమ శాఖాధికారి వరలక్ష్మి తదితరులున్నారు.

బియ్యం లారీ పట్టివేత..?

నర్సింహులపేట, న్యూస్‌టుడే: అక్రమంగా బియ్యం తరలిస్తున్న లారీని మంగళవారం పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. ఖమ్మం నుంచి తొర్రూర్ వైపు వెళ్తుండగా వాహన తనిఖీలో లారీని నర్సింహులపేట పోలీస్‌స్టేషన్ పరిధి సరిహద్దులో పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు లారీని తరలించినట్లు విశ్వనీయ సమాచారం. ఈ విషయంపై స్థానిక ఎస్సై మాలోతు సురేష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఏం పట్టుకోలేదన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు యువత సహకారం అవసరం

కేసముద్రం, న్యూస్‌టుడే: మాదకద్రవ్యాల నిర్మూలనకు యువత సహకరించాలని సీఐ సర్వయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ మానవహక్కుల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు మంగళవారం సీఐ బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ అజీజ్‌బేగ్, అధ్యాపకులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గార్ల, న్యూస్‌టుడే: రైతులు మిరప పంటపై సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో రమారావు కోరారు. మండలంలోని రాజుతండా, మర్రిగూడెంలో మంగళవారం మిరప క్షేత్రాలను ఆయన సందర్శించారు. మిరప పంటలో పైముడత, కింది ముడత, నల్లి వంటి సమస్యలు దృష్టికి వచ్చాయని వెల్లడించారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలను పాటించాలని తెలిపారు.

సంక్షిప్తంగా

ఎన్నిక

గార్ల, న్యూస్‌టుడే: టీపీటీఎఫ్ మండల నూతన కమిటీ అధ్యక్షుడుగా యాదగిరినాయక్, ప్రధాన కార్యదర్శిగా బాలాజీనాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం శీలం వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆ సంఘం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఉపాధ్యక్షులుగా వెంకటరెడ్డి, కవిత, జిల్లా కౌన్సిలర్‌గా హనుమంతు, మహిళా ప్రతినిధులుగా రోజారమణి, పార్వతి, తిరుప, ఆడిట్ కమిటీ బాధ్యులుగా వెంకటస్వామి, గౌరవ సలహాదారులుగా శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మీరా తదితరులు ఎన్నికయ్యారు. నిర్వహణాధికారులుగా ఉప్పలయ్య, రమేష్ వ్యవహరించారు.

నెల్లికుదురు, న్యూస్‌టుడే: టీఎంటీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు నెల్లికుదురు తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాలలో మంగళవారం సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సక్రం రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా నెల్లికుదురు పాఠశాలకు చెందిన తుమ్మ సతీష్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహులపేట పాఠశాలకు చెందిన లూనావత్ శంకర్, మహిళ విభాగం అధ్యక్షురాలుగా అంజన్ సుల్తానా, కార్యదర్శిగా జయరేఖతో పాటు పలువురితో కూడిన నూతన కమిటీని ఎన్నిక చేసి వివరాలు వెల్లడించారు. కిరణ్‌రెడ్డి, కృష్ణప్రసాద్, ఫిలిప్, గోపాల్‌రావు, యాకుబ్ ఆలీ, గోవిందరావు, బాబురావు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నెల్లికుదురు: మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఉపేందర్, వ్యాయామ ఉపాధ్యాయుడు కొమురయ్య తెలిపారు. ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి బి.సింహద్రి పందొమ్మిది సంవత్సరాలోపు బాలురకు గత నెల28న నెల్లికుదురులో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పో టీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్, క్రీడల ఇన్‌ఛార్జి సుధాకర్ తెలిపారు.

మహిళల ధర్నా

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరులో మహిళలు బొడ్డెమ్మను నిమజ్జనం చేయడానికి డీజే పాటలతో కోలాటం ఆడుకుంటూ బయలుదేరగా పోలీసులు అడ్డుపడ్డారు. డీజేను నిమజ్జన ఊరేగింపు నుంచి పంపివేయడంతో మహిళలు రోడ్డుపై బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్సై గిరిధర్ రెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. రాత్రి పది గంటల తర్వాత డీజేలకు అనుమతి లేకపోవడంతోనే డీజే ఆటోను ఊరేగింపు నుంచి పంపించామన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు వెంటనే ఏర్పాటు చేయాలి

ఇనుగుర్తి, న్యూస్‌టుడే: మండలం ఏర్పాటు జరిగి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలు నెలకొల్పలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన కొనసాగుతుందని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుజ్జునూరి బాబురావు సతీమణి రామతార అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం ఆమె పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఇనుగుర్తి బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

దివ్యాంగుల హక్కుల సాధనకు ఉద్యమం

మహబూబాబాద్ న్యూస్‌టుడే: దివ్యాంగులు తమ హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెర్కొని రాజు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో నిర్వహించిన దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 25,26,27 తేదీల్లో సంఘం 4వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కేసు నమోదు

బయ్యారం, న్యూస్‌టుడే: మండలంలోని అభయారణ్యంలో అడవిజంతువులను వేటాడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదుచేసినట్లు డీఆర్వో ఉమారాణి తెలిపారు. మండలంలోని చింతోనిగుంపు గ్రామ అటవి సమీపంలో ఉచ్చులు ఏర్పాటుచేసి లక్ష్మీనారాయణ, ప్రసాద్, రవి అడవిజంతువును వేటాడినట్లు పేర్కొన్నారు. మూడు రోజుల కిందట జరిగిన ఈ సంఘటనపై పూర్తి విచారణ చేసి, అడవి జంతువును వేటాడినట్లు నిర్ధారించి వారిపై కేసు నమోదు చేసినట్లు డీఆర్వో తెలిపారు. వారి నుంచి ఉచ్చులు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఒకరిపై దాడి..

దంతాలపల్లి, న్యూస్‌టుడే: మద్యం దుకాణం వద్ద జరిగిన ఘర్షణలో ఒకరిపై దాడి చేసిన సంఘటన దంతాలపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడి కథనం ప్రకారం. . స్థానిక మద్యం దుకాణానికి తొర్రూరు మండలం మాటేడుకు చెందిన వ్యక్తి మద్యం కోసం వెళ్లాడు. అడిగిన మద్యం లేకపోవడంతో నిర్వాహకులను ప్రశ్నించడంతో మాటామాటా పెరిగి ఆ వ్యక్తిపై నిర్వాహకులు దాడి చేశారు. ఈ ఘటనపై దుకాణం నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు చెప్పారు. విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని ఎస్సై రాజు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో 2024-24 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షించారు. ఐకేపీ 64, సహకార శాఖ 153, కో-ఆపరేటివ్ కార్పొరేషన్ 11, ఇతరులు ఆరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు సమస్యలు ఎదురుకాకుండా మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి


దేవేందర్ (పాతచిత్రం)

మరిపెడ, న్యూస్‌టుడే: ఉద్యోగ అన్వేషణలో యువకుడు పోటీ పరీక్ష రాసేందుకు వెళ్లి రైలు ప్రమాదంలో మృత్యువాత పడటంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం. మరిపెడ మండలం ఉల్లేపల్లి శివారు మాలోతు తండాకు చెందిన మాలోతు దేవేందర్ (30) బ్యాంకు ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాడు. మెయిన్స్ రాసేందుకు కోయంబత్తూరు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మంగళవారం మేడ్చల్ రైల్వే స్టేషన్ వద్ద రైలు నుంచి జారీ పడి మృతి చెందాడు. పోటీ పరీక్షకు హజరై తిరిగి రావాల్సిన కుమారుడు మృత్యువాత పడిన విషయం తెలియగానే కుటుంబ సభ్యుల, తండావాసుల రోదనలు మిన్నంటాయి.

మహిళ ఆత్మహత్యాయత్నం

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స అందించడానికి వైద్యులు నిరాకరించారు. దీంతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొత్తగూడ, న్యూస్‌టుడే: కొత్తగూడ మండలం చిలుకమ్మనగర్ వద్ద మంగళవారం జరిగిన రోడు ప్రమాదంలో పెగడపల్లికి చెందిన మధు, ఆయన ఇద్దరు కుమార్తెలకు గాయాలయ్యాయి. నర్సంపేటలోని తన ఇద్దరూ కుమార్తెలను దసరా సెలవులకు ఇంటికి ద్విచక్రవాహనంపై తీసుకొస్తున్నారు. చిలుకమ్మనగర్ వద్ద వేగంగా వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడగా కారు ఆపకుండా వెళ్లినట్లు బాధితులు తెలిపారు.